Visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక

# సూర్య


www.suryaa.com

నిజామాబాద్

కామారెడ్డి

బుధవారం, 19 జూన్ 2024

పేజీలు : 02



## కుటుంబ కలహాలతో బావ గొంతు కోసిన బావమరిది

**లింగంపేట్, జూన్ 18, సూర్య మేజర్ న్యూస్**

కుటుంబ కలహాలతో బావ గొంతు కోశాడు ఓ బావమరిది. లింగంపేట్ మండలం మెంగారం గ్రామంలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బావమరిది నవీన్, బావ నీల స్వామి పై పాత కక్షలు పెట్టుకొని నాగిరెడ్డిపేట మండలం జాన్కంపల్లి గ్రామానికి చెందిన సుధాకర్ తో కలిసి బావను హత్య చేయాలని ప్రయత్నం చేశాడు. సోమవారం రాత్రి మెంగారం గ్రామంలోని కల్లు త్రాగడానికి నవీన్, సుధాకర్ లు బావను నమ్మించి మెంగారం తీసుకెళ్లి గ్రామంలోని కల్లు దుకాణంలో నీల స్వామి, నవీన్, సుధాకర్ లు కల్లు త్రాగారు. కల్లు దుకాణం నుంచి బయటకు వెళ్ళగానే కోమటిపల్లికి వెళ్దామని నమ్మబలికి బస్టాండ్ వద్దకు రాగానే నవీన్, సుధాకర్ లు నీల స్వామి పై కత్తులతో దాడి చేసి గొంతు కోశారు. అక్కడి నుంచి తప్పించుకున్న నీల స్వామి గ్రామంలోకి వెళ్లి తనపై నవీన్, సుధాకర్ లు దాడి చేసిన విషయం గ్రామస్తులకు చెప్పడంతో, గ్రామస్తులు అక్కడికి వెళ్లి చూడగా సుధాకర్, నవీన్ లు అక్కడి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఏఎస్ఐ ప్రకాష్ మెంగారం చేరుకొని తీవ్రంగా గాయపడ్డ నీల స్వామిని చికిత్స నిమిత్తం ఆసుపత్రి కి తరలించారు. వైద్యుల సలహాల మేరకు అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం నిర్వహిస్తున్నారు. బాధితుడి తల్లి నీల అల్లెవ్వ ఫిర్యాదు మేరకు నవీన్, సుధాకర్ ల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



## ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని
## మహిళా మోర్చా ఆధ్వర్యంలో డి.యం.హచ్.వో కి వినతి పత్రం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 18, సూర్య మేజర్ న్యూస్**

బిజేపి మహిళా మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కామారెడ్డి జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలోని డి.యం.హచ్.వో కి ఆశ వర్కర్ల సమస్య పరిష్కరించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి బక్కి సంధ్య మాట్లాడుతూ., కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆశా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆశా వర్కర్లు సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఎన్నికల అనంతరం ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల పారితోషికాలను రూ.18,000/-లకు పెంచి, ఫిక్స్ వేతనం నిర్ణయించాలనీ అన్నారు. ప్రతి నెలా వేతనం 5 వ తేది లోపల చెల్లించాలని అన్నారు. ఆశా వర్కర్లకు ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు చెల్లిస్తూ సర్క్యులర్ జారీ చేయాలని అన్నారు. ఆశా వర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించాలనీ అన్నారు. జిల్లా అధికారులు ఆశాలతో స్పూటమ్ డబ్బాలను మోపించకూడదని పైనుండి నిర్దిష్టమైన సర్క్యులర్ జారీ చేయాలనీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి హరిక, జిల్లా ఉపాధ్యక్షురాలు సుశిల, నాయకులు బలమని, స్వప్న, సంధ్య, హేమలత తదితరులు పాల్గొన్నారు.



## టీబీ వ్యాధి వ్యాక్సియేషన్ పై
## ఆరోగ్య సిబ్బందికి అవగాహన

**బిక్కనూర్, జూన్ 18, సూర్య మేజర్ న్యూస్:**

టీబీ వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ పై మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఆరోగ్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు, అంగన్వాడీ టీచర్లకు మండల వైద్యాధికారి యెమీమా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల రోజుల లోపు లబ్ధిదారులను సర్వే ద్వారా గుర్తించి వివరాలు అందించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు.18 సంవత్సరాల పైబడిన వారందరికీ బీసీజీ వ్యాక్సినేషన్ ఇవ్వడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. అలాగే ఈనెల 20వ తేదీ నులి పురుగుల నివారణ దినోత్సవం. సందర్భంగా సంవత్సరం నుండి 19 సంవత్సరాల లోపు వారందరికీ ఆల్బెండజైల్ మాత్రలను పకడ్బందీగా వేయాలని సూచించారు. ఇప్పటికే ఆల్బెండైజల్ మాత్రల లబ్ధిదారుల వివరాలను ఆశా కార్యకర్తలు సేకరించడం జరిగిందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఆదర్శ్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకట రమణ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.



## చైతన్య యాత్ర రాష్ట్ర అధ్యక్షులు పోస్టర్ ఆవిష్కరణ

**కామారెడ్డి, సూర్య మేజర్ న్యూస్, జూన్ 18 :**

రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నీలం నర్సింలు అధ్యక్షతన జిల్లా మున్నూరు కాపు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల సమావేశం మంగళవారం జిల్లా సంఘ భవనంలో ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ హాజరై జన చైతన్య యాత్ర పోస్టర్ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొండ దేవయ్య మాట్లాడుతూ., మున్నూరు కాపులు అందరూ ఐక్యంగా ఉండి, రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో అన్ని హోదాల్లో మనవాళ్లు గెలవాలని సూచించారు. అందుకు గాను33 జిల్లాలు పర్యటించి మున్నూరు కాపులను ఏకం చేయడానికి ప్రయత్నం చేస్తున్నాను అని తెలిపారు. కామారెడ్డి జిల్లా లీగల్ సెల్ అడ్వైజర్ గా కాసర్ల శ్రీనివాస్ పటేల్ లాయర్ ని నియమించడం జరిగింది. జిల్లా బాధ్యులు గ్రామాల్లో కమిటీలు వేసి కమిటీలు తీర్మానం ప్రకారము స్థానిక సంస్థల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను తయారు చేసుకొని సిద్ధంగా ఉండాలని సూచించారు. రాబోయే కాలంలో మున్నూరు కాపులే మంచి పొజిషన్ లో ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెట్టి గాడి అంజయ్య, మహిళా అధ్యక్షురాలు బాజా లలిత, జిల్లా బాధ్యులు ఆకుల శ్రీనివాస్, సంకర రాజలింగం, సిద్ధ రాములు, కొమిరెడ్డి నారాయణ, మామిండ్ల లింగం, రామారెడ్డి అధ్యక్షులు శ్రీకాంత్, ప్రవీణ్, దోమకొండ అధ్యక్షులు రామచంద్రం, బిబిపేట అధ్యక్షులు, తాడువాయి అధ్యక్షులు గంగారెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ కాసర్ల రవీందర్, బిక్నూర్ అధ్యక్షులు బల్యాల వెంకట నరసింహులు వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.





## అహ్మద్ బి.ఎడ్ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్ పట్టా



బిక్కనూర్, జూన్ 18 సూర్య మేజర్ న్యూస్

మండల కేంద్రంలో ఉన్న అహ్మద్ బిఎడ్ కళాశాలలో అధ్యాపకురాలుగా పనిచేస్తున్న ఆసం కల్పన ఎడ్యుకేషన్ విభాగంలో పీహెచ్‌ డాక్టరేట్ పట్టా పొందారు. మండలంలోని రామేశ్వర్ పల్లి గ్రామానికి చెందిన ఆసం కల్పన సన్రైజ్ విశ్వ విద్యాలయంలో ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టరేట్ పట్టా సాధించారు. “ఎంపిరికల్ స్టడీ ఆన్ డెవలప్మెంట్ ఆఫ్ కెరియర్ ప్లానింగ్ విత్ రెస్పెక్ట్ టు కంటిన్యూయేషన్ ఆఫ్ హెూమ్ ఎన్విరాన్మెంట్ అండ్ లెవెల్ ఆఫ్ ఎంబిసియన్” అనే అంశంపై డాక్టర్ జగదీష్ బాబులాల్ రాథోడ్ ఆధ్వర్యంలో పరిశోధనలు చేసి యూనివర్సిటీలో సమర్పించారు .వాటిని పరిశీలించిన యూనివర్సిటీ అధికారులు ఆమెకు పీహెచ్డీ ప్రధానం చేశారు. తమకు డాక్టరేట్ రావడానికి పూర్తి సహకారం అందించిన యూనివర్సిటీ అధికారులు, కుటుంబ సభ్యులకు ఎంతో రుణపడి ఉంటానని కల్పన చెప్పారు. ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టరేట్ పట్టా సాధించడం పట్ల గ్రామస్తులు,కళాశాల సిబ్బంది ఆమెను అభినందించారు.

## అశోక్ నగర్ మెయిన్ రోడ్డు గుంతలను పరిశీలించిన మున్సిపల్ చైర్పర్సన్



కామారెడ్డి టౌన్, సూర్య న్యూస్ జూన్ 18:

కామారెడ్డి పట్టణంలోని అశోక్ నగర్ మెయిన్ రోడ్ లో గల ఉన్న గుంతలను మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి, గుంతలను పరిశీలించారు. గడ్డం ఇందుప్రియ మాట్లాడుతూ., ఈ గుంతల సమస్యను మున్సిపల్ అధికారులతో మాట్లాడుతూ తొందరలో ఈ సమస్యను పరిష్కరించాలి అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, కామారెడ్డి పట్టణ కౌన్సిలర్, వార్డ్ కౌన్సిలర్ విజయ్ భాస్కర్ గౌడ్, పాత శివ కృష్ణమూర్తి, రామ్మోహన్, చాట్ల వంశీకృష్ణ, ఏఈ. శంకర్ పాల్గొన్నారు,

## రేషన్ షాపు ఏర్పాటు చేయాలని ఎమ్మార్వో కు వినతి



బిక్కనూర్, జూన్ 18 సూర్య మేజర్ న్యూస్

మండల కేంద్రంలోని పాత హరిజనవాడలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని ఎమ్మార్వో శివప్రసాద్ కు మంగళవారం సమాచార హక్కు చట్టం జిల్లా ప్రతినిధి గంగల రవీందర్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరిజనవాడ ప్రజలు రేషన్ షాప్ కోసం కిలోమీటర్ నడవాల్సి వస్తుందని, రేషన్ బియ్యం కోసం ఎండనక వాననక సుదూర ప్రాంతం నడవాల్సి వస్తుందని, హరిజనవాడలో సుమారు 12 వందల జనాభా ఉన్నారని, వారికోసం ప్రత్యేకంగా వెంటనే రేషన్ షాపును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయ విద్యార్థి గోసు రమేష్, కర్రోళ్ల రాజు ఉన్నారు.

## ఈనెల 20న నులిపురుగుల నివారణ దినోత్సవంను విజయవంతం చేయాలి

### డాక్టర్ శరత్ కుమార్



ఎల్లారెడ్డి, జూన్ 18, సూర్య మేజర్ న్యూస్

ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శరత్ కుమార్ మాట్లాడుతూ., పిల్లల సంపూర్ణ ఆరోగ్యం, వికాసం కోసం నులి పురుగులను నులిపేద్దాం అని అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ఈనెల 20న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం ను ప్రతి ఒక్కరు కలిసి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి

లింగంపేట్, జూన్ 18, సూర్య మేజర్ న్యూస్

విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు లింగంపేట్ ట్రాన్స్కో ఏఈ సాయినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. లింగంపేట్ మండలంలోని వివిధ గ్రామాల విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే సెక్షన్ కార్యాలయం నందు దరఖాస్తు రూపంలో అందజేసినట్లయితే తమ ఫిర్యాదులను సమీక్షించి సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకో బడతాయని పేర్కొన్నారు.

## సొసైటీ వైస్ చైర్మన్ కు సన్మానం




రాజంపేట, జూన్ 18, సూర్య మేజర్ న్యూస్

రాజంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ అంద్యాల రమేష్ ను మాజీ ప్రభుత్వ విప్ కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మంగళవారం ఘనంగా సన్మానం చేశారు. బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించిన ఆదేశాలను అమలు చేయడంలో ముందు వరుసలో ఉండి, ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కష్టపడి పార్టీ కోసం పని చేసినందున ఆయనను అభినందించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా అంద్యాల రమేష్ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన ఏ పనినైనా కర్తవ్యం గా భావిస్తూ ముందుకు సాగుతానని, గంప గోవర్ధన్ సారథ్యంలో పనిచేస్తానని, ఆయన ఆదేశాలను పాటిస్తూ పార్టీ కోసం ఛాయాశక్తుల కృషి చేస్తానని అన్నారు.

## ట్రాన్స్కో..... జర దేకో

- ట్రాన్స్ఫార్మర్ చుట్టూ అల్లుకున్న తీగలు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు, సిబ్బంది



సదాశివనగర్, జూన్ 18, సూర్య మేజర్ న్యూస్

సదాశివనగర్ మండలం ఉత్తునూర్ గ్రామంలో హనుమాన్ ఆలయం ముందర గల ట్రాన్స్ఫార్మర్ కు పిచ్చి మొక్కల తీగలు అల్లుకున్నాయి. గ్రామంలో తరచూ కరెంటుకు అంతరాయం ఏర్పడుతుంది. విద్యుత్ అధికారులు, సిబ్బంది పట్టించుకున్న పాపాన పోలేదు. ఆదివారం సాయంత్రం నుండి రాత్రి వరకు విద్యుత్కు అంతరాయం ఏర్పడింది. గ్రామస్తులు సబ్ స్టేషన్కు వెళ్లి విద్యుత్ సమస్యపై ఆరా తీశారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే కరెంటుకు అంతరాయం కలుగుతుందని గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా స్పందించి ట్రాన్స్ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కల తీగలను తొలగించి కరెంటుకు అంతరాయం కలగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అడవిలింగాల్ గ్రామంలో భూ లక్ష్మమ్మ, ఎల్లమ్మ కు ఘనంగా బోనాల పండగ.

ఎల్లారెడ్డి, జూన్ 18, సూర్య మేజర్ న్యూస్

ఎల్లారెడ్డి మండలంలోనీ అడవిలింగాల్ గ్రామంలో మంగళవారం సాయంత్రం గ్రామస్తులు ఎల్లమ్మ, భూలక్ష్మమ్మ గ్రామదేవతల అమ్మవార్లకు బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని మహిళలు ప్రతీ ఇంటి నుంచి బోనాలను తీసుకువచ్చి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. వర్షాలు బాగా కురవాలని, పాడిపంటలు పండాలని పిల్ల పాపలతో చల్లగా ఉండాలని గ్రామస్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల సందర్భంగా గ్రామంలోని యువకులు డీజే సౌండ్ తో చేసిన నృత్యాలు అలరించాయి. గ్రామ మాజీ సర్పంచ్ గుడిపల్లి ప్రతాప్ రెడ్డి, ఎంపీటీసి శివగౌడ్, జీవన్ గౌడ్, పడమటి రాజేశ్వర్, పెంట మానయ్య, బీజేపి జిల్లా కన్వీనర్ పిట్ల ప్రవీణ్ కుమార్, పోలీస్ కృష్ణమూర్తి, పోలీస్ నరేందర్, పోలీస్ నాగరాజు, పోలీస్ కృష్ణ, పోలీస్ వెంకన్న, శివుగారి బాలయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



